క్లుప్తంగా

వెంకటాద్రిపై ప్రత్యేక పూజలు



పెందుర్తి: వెంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 13 రోజు శనివారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమొరై, తిరుప్పావై, పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి చేశారు. 13వ పాశురం వినిపించారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో తులాభారం ఇచ్చి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

అప్పన్నకు విశేషంగా గరుడసేవ



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను గరుడవాహనంపై వేంజేంపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఘనంగా మేలుకొలుపు



నాయుడుపాలెంలో మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, చిన్నారులు

పరవాడ: సమరసతసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెంలో సిద్ధి వినాయక ఆలయం వద్ద 13వ రోజు మేలుకొలుపు కార్యక్రమాన్ని శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం నుంచి పల్లకీని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటికి వస్తున్న వినాయకుడ్ని ప్రజలు దర్శించుకోవాలని ఫౌండేషన్ ప్రతినిధి కూండ్రపు అప్పలనాయుడు కోరారు. కార్యక్రమంలో కె.ముత్యాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామికి విశేష పూజలు



పెందుర్తి: ఏకాదశి సందర్భంగా పెందుర్తి సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళి కృష్ణశర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివాకి అర్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు.

అర్జీలకు సత్వర పరిష్కారం



అధికారులకు అర్జీలు అందజేస్తున్న ప్రజలు

పరవాడ: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై అందిన అర్జీలను ఆన్‌లైన్ చేసి త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పరవాడ మండల సర్వేయర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలో ఈ.బోనంగి గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రజల నుంచి భూ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సదస్సులో వివిధ భూ సమస్యలపై ప్రజల నుంచి 38 అర్జీలను స్వీకరించామని సర్వేయర్ శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు, ఉప సర్పంచ్ మేడిశెట్టి వెంకటరావు, వీఆర్వో శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ముం'చెత్త'గా..



కాలనీ ప్రధాన కాలువలో పూడికలు



రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు





33 బ్లాక్ వద్ద పైప్ పగిలిపోయి వృథాగా పోతున్న తాగునీరు

పరవాడ : గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం (జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ నగర పునర్నిర్మాణ యోజన) కాలనీలో నివసిస్తున్న ప్రజలు సమస్యల వలయంలో చిక్కుకొని సతమతమవుతున్నారు. 2004–09 మధ్య కాలంలో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో మంజూరైన జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో 58 బ్లాక్‌లో 1,856 ఇళ్లను నిర్మించారు. కాలనీ వాసులకు అవసరమైన తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆ తరువాత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కాలనీలో పలు సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కాలనీ ప్రజలను ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటి సమస్యలు పట్టి వేధిస్తున్నాయి. కాలనీలో అనేక బ్లాక్‌ల్లో ఏర్పాటు చేసిన మురుగు కాలువల్లో చెత్త చెదారాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఫలితంగా దోమల బెడద అధికమైందని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన కాలువలతో పాటు వీధి కాలువలు పూడికలతో నిండిపోయాయి. చీకటి పడితే దోములు వీరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.



గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ

తాగునీరు గగనం

తాగునీటి సరఫరా విషయానికొస్తే నాలుగో అంతస్తుపై నివాసం ఉంటున్న ప్రజలకు తాగునీరు అందడం లేదు. పై అంతస్తులో ఉంటున్న ప్రజలు సొంతంగా పైపులు ఏర్పాటు చేసుకొని తాగునీటిని పట్టుకోవలసి వస్తోందని స్థానికులు చెపుతున్నారు. పైపులైన్‌లో ఫోర్స్ తక్కువగా ఉండడం వలన 16 నుంచి 58 బ్లాక్‌ల్లో నివాసం ఉంటున్న ప్రజలకు సక్రమంగా తాగునీరందడం లేదని వాపోతున్నారు. 33 బ్లాక్ వద్ద పైపులైన్ పగిలిపోయి మూడు నెలల నుంచి తాగునీరు వృథాగా పోతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరినా ప్రయోజనం ఎవరూ పట్టించుకోలేదని కాలనీ వాసులు కాలనీ ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యర్థాలు తొలగించాలి



రహదారులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు, పూడికలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వ్యర్థాలు పేరుకుపోయిన కారణంగా దోమలు పెరిగిపోయాయి. చీకటి పడితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. విష జ్వరాలతో మంచాన పడుతున్నాం. కాలువల్లో పూడికలు, రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను సకాలంలో తొలగించాలి.

– ఎస్.సన్యాసిరావు

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలి



కాలనీలో పలు చోట్ల పైపులైన్లకు రంధ్రాలు పడడంతో తాగునీరు వృథాగా పోతోంది. ఫలితంగా మంచినీటికి ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి సరఫరాలో ఫోర్స్ తక్కువగా ఉండడం వల్ల నాలుగో అంతస్తుపై ఉంటున్న వారికి తాగునీరు అందడం లేదు. మంచినీటి సరఫరాలో కొంత మేర ఫోర్స్‌ను పెంచడం ద్వారా ప్రజలందరికీ తాగునీరందుతుంది. మూడు నెలలుగా 33 బ్లాక్ వద్ద మంచినీటి సరఫారా జరుగుతున్న పైపనకు రంధ్రం పడి మంచినీరు వృథాగా పోతోంది. సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– డి.సంగీత, గృహిణి

సమస్యలు పరిష్కరించాలి



కాలనీలో రోడ్లు, కాలువల్లో ఇష్టానుసారంగా చెత్త చెదారాలను వేస్తున్న కాలనీ వాసులకు పారిశుధ్య పరిస్థితులపై అవగాహన కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే శానిటేషన్ సిబ్బంది రోజూ వ్యర్థాలు తొలగించాలి. కాలనీలో పారిశుధ్యం, మంచినీటి ఇబ్బందులను పరిష్కరించాలి.

–పైడినాయుడు, కాలనీ వాసి

మోటారు రంగ కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ:

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాల విధానాల ఫలితంగా మోటారు రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. మోటారు కార్మికులతో లంకెలపాలెం కూడలిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లైసెన్స్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల మంజూరును ప్రవేటు వ్యక్తులకు అప్పగించడం వలన మోటారు కార్మికులపై మరింత భారం పడుతోందన్నారు. లైసెన్స్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల మంజూరును ప్రభుత్వం ఆధీనంలోనే నడపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మోటారు వాహనాల చట్టం సవరణలు చేయడం వలన ఆటో, మోటారు వాహనాల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అధికారంలోకి వస్తే ఆటో, మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల ద్వారా రాయితీపై ఆటోలు కొనుగోలుకు రుణ సదుపాయం కల్పిస్తామని, వాహన మిత్ర పథకాన్ని అమలు చేస్తామని జీవో 21ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వోలా, ఊబర్, రాపిడ్ వంటి విదేశీ యాప్‌లు కారణంగా ఆటోల కిరాయిలు గణనీయంగా తగ్గిపోయి కార్మికులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు.

కూటమి ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించని పక్షంలో భారీ ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని గనిశెట్టి హెచ్చరించారు. సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు చొడువాడ నరసింగరావు, కె.వెంకటస్వామి, కె.మహాలక్ష్మినాయుడు, శెట్టి గోవింద, పి.రాంబాబు, కె.గోవింద, షేక్ దుర్గా పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్ట్

- రూ.2 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: ఓ చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడ్ని పెందుర్తి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.రెండు లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ డి.సూరిబాబు ఆయా వివరాలను వెల్లడించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింహాచలం సమీపంలోని విరాట్ నగర్‌లో కొద్ది రోజుల క్రితం ఇద్దరు దంపతులు బైక్‌పై వెళుతున్నారు. అదే సమయంలో కంచరపాలెం బర్మా కాలనీకి చెందిన గురుగుబిల్లి పవన్‌కుమార్ అలియాస్ గ్యాంగ్ అనే యువకుడు డియో స్కూటీ (దొంగిలించింది)పై వచ్చి మహిళ మెడలోని రెండు తులాల బంగారు పుస్తులతాడు తెంచుకుపోయాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పెందుర్తి పోలీసులు దర్యాప్తు ముమ్మరంగా చేపట్టారు. ఈ క్రమంలో శనివారం అతడు నగరంలో స్కూటీపై తిరుగుతుండగా పట్టుకుని బంగారంతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకుని..నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.


పెదగొల్లలపాలెంలో వేద భారత పరిక్రమ యాత్ర



సప్త రుషి చారిటబుల్ ట్రస్ట్ వద్ద ప్రారంభమైన వేద భారత పరిక్రమ యాత్ర

సబ్బవరం: వేద పరిరక్షణకు, భారతీయులంతా వేద విజ్ఞానాన్ని అనుసరించేలా వేద ప్రచార యాత్రను నిర్వహిస్తున్నట్టు శ్రీసప్త ఋషి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.మాధవ శర్మ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద భారత పరాక్రమ యాత్ర పెదగొల్లలపాలెంలో శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఐదేళ్లుగా యాత్ర దేశమంతటా పయనిస్తూ వేదాలను పరిరక్షించాలన్న ఉద్దేశంతో వేద పండితులతో భారతదేశమంతా ప్రదక్షణ క్రమంలో పర్యటించి చతుర్వేద పారాయణం చేస్తున్నామన్నారు. హిందూ వేద సాంస్కృతిని తిరిగి తీసుకురావడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఈ యాత్రలో 25 మంది వేద పండితులు పాల్గొని 21వేల కిలో మీటర్ల ప్రయాణిస్తున్నారు. వేదాల అభివృద్ధికి సప్త రుషి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.మాధవ శర్మ తన జీవితాన్ని అంకితం చేస్తూ ఈ ట్రస్ట్‌ను 2009లో ప్రారంభించారు. ఈ ట్రస్ట్ ద్వారా వేదపాఠశాల,గోశాలను నిర్వహించి గో పరిరక్షణపై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారు.

నిఖిలలోక హృదయవాసుడు.. శ్రీనివాసుడు



ప్రవచిస్తున్న విభీషణ శర్మ



భక్తిగీతాలు ఆలపిస్తున్న మాధురి, శిరీష

ఎంవీపీకాలనీ: కష్టాలను తొలగించి, అమృత ఐశ్వర్యాలను ప్రసాదించే నిఖిలలోక హృదయవాసుడిగా కలియుగ శ్రీనివాసుడు కొలువై ఉన్నాడని ఆకెళ్ల విభీషణ శర్మ అన్నారు. శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కు వేదికగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వైభవం ప్రవచన కార్యక్రమం శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా మూడో రోజు విభీషణ శర్మ చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. శ్రీవారిని కీర్తించడం, సేవించడం ప్రతి భక్తుడికి పూర్వజన్మ శుకృతమన్నారు. ఈ సందర్భంగా వైభవ సిస్టర్స్ పి.మాధురి, పి.శిరీష బృందం, రత్నమాల చిన్నారుల బృందం చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిగీతాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు బాధ్యత లేకపోతే ఎలా?

- వారి నిర్లక్ష్యంతోనే మైనింగ్ తవ్వకాలు, అక్రమ మద్యం అమ్మకాలు
- అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం
- మండల పరిషత్ సమావేశంలో పలు అంశాలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు



పాల్గొన్న పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు

సబ్బవరం: మండలంలో జరుగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలు, అక్రమ మద్యం అమ్మకాలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అధికారులను ఆదేశించారు. సబ్బవరం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించగా..ఎమ్మెల్యే ముఖ్య అతిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై తనకు ఫిర్యాదులు అందాయన్నారు. స్థానికులు ఫిర్యాదులు చేసిన అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. మండలంలో విచ్చలవిడితనం, బాధ్యత లేకపోవడంతో అక్రమ మైనింగ్, అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తమ తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మండలంలో ఇటీవల తుపాను ప్రభావంతో పంటలకు వాటిల్లిన నష్టం, తీసుకున్న చర్యలపై వ్యవసాయ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

అయితే తడిసిన వరి పంటలపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేవని, అయినా నష్టపోయిన వివరాలను నమోదు చేస్తున్నామని అధికారులు సమాధానం ఇచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలం అక్రమణలకు గురవుతోందని, కళాశాల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆక్రమణలు తొలగించాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ స్థలాలు, శ్మశాల వాటికలు ఆక్రమణలకు గురైతే ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించాలని ఎమ్మెల్యే పంచకర్ల ఆదేశించారు. వీటితో పాటు మండలంలోని విద్య,వైద్య ఆరోగ్య శాఖ,శిశు సంక్షేమ శాఖ,పశు సంవర్థక శాఖ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, విద్యుత్, ఉద్యాన శాఖల పనితీరుపై ఎమ్మెల్యే సమీక్షించారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దాడి ఝాన్సీ లక్ష్మీ రాణి, చొక్కాకుల గోవింద్, ఎంపీడీవో పద్మజ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న సంతోష్ దంపతులు

సబ్బవరం: సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణానికి సబ్బవరంలోని దుర్గానగర్ కాలనీకి చెందిన మంగళగిరి సంతోష్ స్టీల్ గేట్ నిర్మాణానికి రూ.30,116 విరాళంగా శనివారం అందజేశారు. విరాళం అందజేసిన సంతోష్ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రకాష్, బర్ల రమణ, దనిమిరెడ్డి శ్రీనివాస్, పెన్నం శ్రీనివాస రావు, కొల్లి కృష్ణ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

డాబాగార్డెన్స్ : నగరంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, వాటి నుంచి జాగ్రత్తగా ఉండాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి సూచించారు. సైబర్ నేరాలపై సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ఐఎల్ నరసింహారావుతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మహిళా వెల్ఫేర్ కార్యదర్శులు, ఎన్జీవోస్, అకౌంట్ విభాగం, ఎస్ఆర్‌యూ విభాగం, సీవోసీ విభాగాల సిబ్బందికి అవగాహన కల్పించారు. రమణమూర్తి మాట్లాడుతూ ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, అందుకు సంబంధించి తమ మొబైల్ హ్యాకింగ్‌కు గురికాకుండా అవగాహన ఉండాలని సూచించారు.

ఎర్ర జెండా రెపరెపలు



సీపీఎం జిల్లా మహాసభలు శనివారం సుజాతనగర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీపీఎం నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ ప్రాంతమంతా ఎర్రని జెండాలతో రెపరెపలాడింది. ఆ పార్టీ ముఖ్య నేతలంతా తరలిరాగా..కార్మికవర్గమంతా జెండాలు చేతబూని ర్యాలీలో భాగస్వామ్యమయ్యాయి. -పెందుర్తి



యువకుడి అదృశ్యం



మోహన్ లక్ష్మణ్ (ఫైల్)

పరవాడ: మండలంలో ఈ.బోనంగి శివారు బొద్దపువానిపాలెం గ్రామానికి చెందిన కులుసు మోహన్ లక్ష్మణ్ ఉరఫ్ పండు శనివారం ఉదయం 11 గంటల నుంచి కనిపించడం లేదని అతని తల్లి కె.కుమారి పరవాడ పోలీసులకు పిర్యాదు చేసింది. యువకుడికి గత కొంత కాలం నుంచి మతిస్థిమితం లేదని, గ్రీన్ టీ షర్ట్, బ్లూ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపింది. ఆచూకీ తెలిసిన వారు 9440796038 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు కోరారు.

సింహగిరిపై టిప్పర్ బోల్తా



బోల్తా పడిన టిప్పర్

సింహాచలం : సింహగిరిపై గజపతిసత్రం వెనుక హిల్‌టాప్‌రోడ్డులో శనివారం టిప్పర్ బోల్తా పడింది. గజపతిసత్రం వెనుక భాగంలో హిల్‌టాప్‌రోడ్డులో జరుగుతున్న ప్రసాద్ స్కీమ్ పనులకు గ్రావెల్ తీసుకెళ్లి తిరిగి వస్తున్న టిప్పర్ తెల్లవారుజామున 4.30గంటల సమయంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. టిప్పర్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్ ఎలాంటి గాయాలు కాలేదు. కాగా విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో ఉదయం 6 గంటల వరకు సింహగిరిపై విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.